క్లుప్తంగా

బైక్ ర్యాలీ



వర్ధన్నపేట : శ్రీరామ నవమిని పురస్కరించుకుని పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. తొలుత శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బీజేపీ అనుబంధ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ శ్రీసీతారాముల కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి సత్యం, పెద్దూరి రాజ్‌కుమార్, గురుప్రసాద్, మల్లెసాక అనిల్, తేజా నాయక్ పాల్గొన్నారు.

విరాళం



నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన జయశ్రీ గ్రామైఖ్య సంఘం సభ్యుల భాగస్వామ్యంతో రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రూ.15 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకుడు కొండ కృష్ణస్వామికి సభ్యులు నగదు అందించారు. అనంతరం సయశ్రీ గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు ముత్యాల మౌనిక, ప్రధాన కార్యదర్శి కుక్కముడి శారద, కోశాధికారి గాదగాని రాణి, ఉపాధ్యాక్షురాలు మాటూరి రమాదేవి, సహాయ కార్యదర్శి మారెడుగొండ అమరావతి, వీఓఏ రవి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్య


ప్రమోద్ (ఫైల్)

దుగ్గొండి : మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కట్కూరి ప్రమోద్ (28) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీరామ నవమి ఉత్సవాలకు వెళ్లి వచ్చిన తల్లి రాజమ్మ గమనించి స్థానికుల సహకారంతో ప్రమోద్‌ను కిందకు దించగా అప్పటికే అతడు మృతి చెందాడు. ప్రమోద్ 13 ఏళ్లుగా మానసిక స్థితి బాగాలేక మందులు వాడుతున్నట్టు తెలిసింది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై జక్కుల పరమేశ్ మీడియాకు తెలిపారు.

నివాళి



నర్సంపేట : పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 12వ వార్డు కమిటీ అధ్యక్షుడు గుడికందుల సంతోశ్ తండ్రి రాములు బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్, బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు బుధవారం వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మహ్మద్ మసూద్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు మెరుగు సాంబయ్య, 13వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీరామోజు మురళి, 20వ వార్డు అధ్యక్షుడు రామగోని శ్రీనివాస్, బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, జిల్లా నాయకుడు కందగట్ల నాగరాజు, రాష్ట్ర సోషల్ మీడియా నాయకులు మైండ్ల గగన్‌కుమార్, తదితరులు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల స్వాధీనం

నర్సంపేట రూరల్ : అక్రమంగా తరలిస్తున్న 11 గోవులను పోలీసులు స్వాధీనం చేసుకుని వర్ధన్నపేట గోశాలకు తరలించారు. నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి కథనం ప్రకారం .. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల నుంచి ప్రత్యేక వాహనంలో 11 గోవులను కొమ్మాల అంగడిలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా నర్సంపేటలోని వ్యవసాయ మార్కెట్ వద్ద పోలీసులు అడ్డుకుని విచారణ చేపట్టారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని వర్ధన్నపేటలోని గోశాలకు తరలించడంతోపాటు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తండాలో బొడ్రాయి శిలాఫలకం ధ్వంసం



చెన్నారావుపేట : మండలంలోని జీడిగడ్డతండాలో బొడ్రాయి శిలాఫలకాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. తండాలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఆ శిలాఫలకాన్ని ఆగంతకులు ధ్వంసం చేయడం చర్చనీయాంశంగా మారింది. మాజీ సర్పంచ్ బానోతు లాల్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నర్సంపేట : శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళసూత్రం చూపుతున్న అర్చకులు



నర్సంపేట : వాసవీ కల్యాణ మండపంలో శ్రీసీతారాముల కల్యాణం



నర్సంపేట రూరల్ : గుంటూరుపల్లిలో..



వైభవంగా సీతారాముల కల్యాణం


దుగ్గొండి : తలంబ్రాలు తీసుకొస్తున్న సరళ-జితేందర్‌రెడ్డి

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సంపేట, నెక్కొండ, చెన్నారావుపేట, గీసుకొండ, నల్లబెల్లి, దుగ్గొండి, వర్ధన్నపేట, ఖానాపురం, సంగెం, రాయపర్తి మండలాల్లో బుధవారం సీతారాముల కల్యాణం వైభవం జరిగింది. ఆలయాల్లో ఉదయం నుంచే సందడి నెలకొంది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

-సాక్షి నెట్‌వర్క్


నెక్కొండలో..


చెన్నారావుపేట : ఎల్లాయిగూడెంలో..


చెన్నారావుపేట : ధ్వజ స్తంభానికి పూజ చేస్తున్న శివసత్తులు


గీసుకొండలో..


నల్లబెల్లి : కల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకుడు


దుగ్గొండి : మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు


వర్ధన్నపేటలో..


నల్లబెల్లి : అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు


వర్ధన్నపేట : తీర్థ ప్రసాదాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే


ఖానాపురం : ధర్మరావుపేటలో కల్యాణం


సంగెం : గవిచర్ల రామలింగేశ్వర ఆలయంలో..


రాయపర్తి : పూజ చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి


రాయపర్తి : తిర్మలాయపల్లిలో..

తేమ శాతం 18కి మించొద్దు

● జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి

పర్వతగిరి : రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తేమ శాతం 18కి మించకుండా చూసి కాంటా వేసి మిల్లుకు పంపాలని డీసీఓ సంజీవరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులోని, చౌటపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం డీసీఓ సంజీవరెడ్డి సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్, మాయిశ్చర్ మిషన్, టార్పాలిన్లు, కాంటాలు సెంటర్, నిర్వహణ పుస్తకాలు తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు తాగునీరు, నీడను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు మిల్లుల నుంచి ట్రక్ సీట్లు తెప్పించుకొని రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని చెప్పారు. రైతులు ధాన్యాన్ని తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్‌లో శుద్ధి చేయించి కాంటా పెట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి, సీసీలు కాంతయ్య, రమాదేవి, సుధాకర్, రవీందర్, రాజు, వీఓఏలు కరుణ, రజిత, అరుణ, మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాయిశ్చర్ మిషన్‌ను పరిశీలిస్తున్న డీసీఓ

శిథిలావస్థలో ప్రభుత్వ ఆస్పత్రి

ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. గతంలో నాటి ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రి సీలింగ్ పెచ్చులూడిపోయి ఎప్పుడు మీద పడి ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలోనే వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

మండల కేంద్రంలో సుమారు 25 ఏళ్ల క్రితం ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించారు. వైద్యులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్యం కోసం మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రతీరోజు సుమారు 50 మంది రోగులు రావడం పరిపాటి. వైద్యులు, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆస్పత్రిలోని పలు గదుల్లో సీలింగ్ పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రసవాల తర్వాత మహిళలకు కేటాయించే గదిలో ప్రమాదకర స్థితిలో పెచ్చులూడిపోయి బెంబేలెత్తిస్తున్నాయి. అదే గదిలో మందులను భద్రపర్చారు. విధి నిర్వహణలో భాగంగా గదుల్లోకి రావాలంటే వైద్యులు, సిబ్బంది జంకుతున్నారు.


ప్రభుత్వ ఆస్పత్రి


పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా ఉన్న గది

రూ.1.80 కోట్లు ఉన్నాయా?

ప్రభుత్వ ఆస్పత్రి ప్రమాదకర స్థితంలో ఉండగా గతంలో ఎన్నికల ముందు నాటి ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. పనులు చేపట్టడానికి పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఆస్పత్రిని సైతం పరిశీలించారు. మంజూరైన నిధులతో ఆస్పత్రిలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కోసం పీహెచ్‌సీ నుంచి జిల్లా వైద్యాధికారుల ద్వారా కలెక్టర్‌కు నివేదికలు పంపారు. నాటి నుంచి పనులు చేపట్టలేదు. పురోగతి లేదు. నిధులు ఉన్నాయా? అన్న అనుమానం వ్యక్తమౌతోంది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



ఆస్పత్రి మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలి. గతంలో ఆస్పత్రి అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలవాలి. ఆస్పత్రిలో అభివృద్ధి పనులు చేపట్టాలి. వైద్యులకు, సిబ్బందికి, రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నిధుల వివరాలు వెల్లడించాలి. లేకపోతే ఆందోళనలు తప్పవు.

వేములపల్లి ప్రకాశ్‌రావు, ఎంపీపీ, ఖానాపురం

విద్యార్థి మృతికి బాధ్యులను శిక్షించాలి

నల్లబెల్లి : భువనగిరిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ప్రశాంత్ (12) మృతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీటీసీ జన్ను జయరావు, దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి వారు బుధవారం లేఖ పోస్టు చేశారు. అనంతరం మీడియాతో జయరావు, సాంబయ్య మాట్లాడారు. కలుషిత ఆహారం తిని 28 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్, వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. వారిని సర్వీస్ నుంచి తొలగించాలని, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.


లేఖ పోస్ట్ చేస్తున్న సాంబయ్య

యువరైతుకు సన్మానం



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన యువరైతు నరేశ్‌ను 12 గ్రామాలకు చెందిన రైతు మిత్ర సంఘాల సభ్యులు బుధవారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నరేశ్ యాసంగిలో 2 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసి అధిక దిగుబడి సాధించాడు. ఈ క్రమంలోనే ఆయన పంట క్షేత్రాన్ని రైతు మిత్ర సంఘాల సభ్యులు బుధవారం పరిశీలించి సాగు వివరాలను అడిగి తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్‌కుమార్, రవీందర్, నల్ల రాజిరెడ్డి, అచ్చిరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు


రాయపర్తి : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కంట్రోలర్


దుగ్గొండి : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమాదేవి బాలవికాస ఆధ్వర్యంలో..

రాయపర్తి : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక ఆర్టీసీ కంట్రోలర్ బీఎస్.చారి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేలా తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి ఆదేశాల మేరకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దుగ్గొండి : జలదానం కార్యక్రమంలో భాగంగా బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని తొగర్రాయిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మహిళా సంఘాల బాధ్యులతో కలిసి బాలవికాస ప్రతినిధి రమాదేవి ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో జలదాన కేంద్రాల ద్వారా బాటసారుల, ప్రయాణికుల దాహార్తిని తీర్చే దిశగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలవికాస ప్రతినిధి లక్ష్మి, మహిళా సంఘాల ప్రతినిధులు నల్ల శాంత, చిలువేరు రజిత తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

శాయంపేట : సేంద్రియ ఎరువులైన పేడ, చెరువు మట్టి, పచ్చి రొట్టె లాంటి కంపోస్ట్ ఎరువులను వినియోగించడం ద్వారా వ్యవసాయ భూమిలో భూసారం పెరిగి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రజ్వల్ సంస్థ కార్యకర్త పోతు సునీల్ అన్నారు. మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో బుధవారం హెచ్అండ్ఎం ఆర్థిక సహకారంతో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడారు. రైతులు వ్యవసాయ భూముల్లో రసాయనిక పురుగుమందులు అధికంగా వినియోగించడం వలన సారవంతమైన నేలలు కనుమరుగవుతున్నాయని, నిస్సహాయత వ్యవసాయ భూములుగా మారుతున్నాయని అన్నారు. రైతులందరూ వ్యవసాయ క్షేత్రాల నుంచి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేసుకోవడం ద్వారా వచ్చే ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. ఈ ప్రాంతంలో ఎస్‌పీకే పోషకాలు అధికంగా ఉన్నాయని, సేంద్రియ కర్బనం తక్కువగా ఉండటం వలన సరైన దిగుబడి రావడం లేదన్నారు. సేంద్రియ కర్బనాన్ని పంట క్షేత్రాల్లో వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సునీల్

అరూరిని ఎంపీగా గెలిపించాలి

కాశిబుగ్గ: వరంగల్ ఎంపీగా బీజేపీ నుంచి బరిలో నిలిచిన అరూరి రమేష్‌ను గెలిపించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కోరారు. 19వ డివిజన్‌లో బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎరుకుల రఘునారెడ్డి, హరీష్, ఓం ప్రకాష్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతివనం చెట్ల నరికివేత

కొత్తగూడ: మండలంలోని వేలుబెల్లి మెగా పల్లెప్రకృతి వనంలోని చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఉపాధి హామీ పథకం ద్వారా రెండేళ్ల క్రితం అయిదు ఎకరాల్లో మెగా పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చెట్లు నరికేశారు. సుమారు 15వేల చెట్లు నరికినట్లు అధికారులు గుర్తించారు. భూమిని ఆక్రమించుకునేందుకే చెట్లు నరికి ఉంటారని గ్రామంలో చర్చ జరుగుతోంది. ఘటనపై కొత్తగూడ పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేశారు.

ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కుమార్

వరంగల్ : వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్ ప్రాంతంలోని ఏనుమాముల సమీపంలోని బాలాజీనగర్ ఏరియాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పత్తి కుమార్ ఆ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతం జారీ చేసిన నియామక పత్రాలను పత్తి కుమార్‌కు జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ బుధవారం అందజేశారు. అనంతరం కుమార్‌ను స్వర్ణ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నాగరాజు, నాయకులు, కార్యకర్తలకు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫార్మసిస్ట్ అసోసియేషన్ కార్యదర్శిగా బుచ్చిబాబు



ఖిలా వరంగల్: ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వరంగల్ నగరంలోని శివనగర్ ప్రాంతానికి చెందిన ఎ.బుచ్చిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు బుచ్చిబాబుకు ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్ బుధవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ ఫార్మసిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటేయాలి



పరకాల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో హక్కు కలిగిన ప్రతీఒక్కరూ స్వేచ్ఛగా ఓటేయాలని పరకాల సీఐ రవిరాజు కోరారు. ప్రత్యేక పోలీసు బలగాలతో పట్టణంలో బుధవారం కవాతు నిర్వహించారు. జాతీయ జెండాలతో పోలీసులు చేపట్టిన కవాతును ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతం నిర్వహించేందుకు ప్రజలతో పాటు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల నియామవళిని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.